క్లుప్తంగా

వక్తృత్వ విజేతకు బహుమతి



సూరేపల్లి(భట్టిప్రోలు): బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో సేవ్ ద గరల్ చైల్డ్ అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో భట్టిప్రోలు మండలం సూరేపల్లి వీపీ అండ్ జీఎస్ఎం హైస్కూల్‌కు చెందిన శనగపల్లి నవ్య (10వ తరగతి) ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా సోమవారం బాపట్లలో జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, డీఆర్వో, అడిషనల్ డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ సీహెచ్ సత్తిబాబుల చేతుల మీదగా రూ. 3 వేలు నగదు బహుమతిని నవ్య అందుకుంది. ప్రతిభ చూపిన నవ్య, శిక్షణ ఇచ్చిన కె.శ్యామకుమారిలను హైస్కూల్ పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకట కృష్ణారావు, ప్రధానోపాధ్యాయులు కూచిభొట్ల శ్రీనివాస శర్మలు ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రీవెన్స్‌కు ఆరు అర్జీలు



రేపల్లె రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి తెలిపారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వం నియంత్రించాలని కోరుతూ పట్టణాభివృద్ధి సంఘం సభ్యులు అర్జీ అందించారని రామలక్ష్మి తెలిపారు. ఆక్రమణల గురించి రెండు, సర్వే సమస్యలపై 2 అర్జీలు అందినట్టు వెల్లడించారు. ఇతర సమస్యలపై ఒక అర్జీ అందిందని పేర్కొన్నారు. ఈ ఆరు అర్జీలను పరిశీలించి ఆయా శాఖలకు పంపినట్టు వివరించారు.

వైన్ షాపు తొలగించాలని వినతి

భట్టిప్రోలు: భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన వైన్‌షాపును తొలగించాలని సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్ కుమార్ తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఈ వైన్ షాపు సమీపంలో 100 మీటర్లలోపు హైస్కూల్, దేవాలయం ఉన్నందున విద్యార్థులు, కళాశాలలకు వెళ్లే స్టూడెంట్స్ రోజువారీ ప్రయాణం చేసే ప్రజలు ఇబ్బందులు పడే ప్రమాదం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గుడికి, బడికి 100 మీటర్ల దూరంగా వైన్‌షాపును ఏర్పాటు చేయాలనే నిబంధనను అమలు చేసేలా చూడాలని కోరారు.

గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదు వేగవంతం చేయాలి



వేమూరు: గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. స్థానిక లక్ష్మీ పద్మావతి కల్యాణ మండపంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదుకు శ్రీకారంచుట్టాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దండే సుబ్బారావు, నాయకులు జొన్నల గడ్డ విజయబాబు, కనగాల మధుసూదనరావు, తూనుగుంట్ల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

అమర్తలూరు(వేమూరు) :అమర్తలూరు మండలంలో రెవెన్యూ గ్రామ సభలు బుధవారం నుంచి నిర్వహించనున్నట్టు తహసీల్దారు నెహ్రూ తెలిపారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు యలవర్రు గ్రామ సచివాలయంలో, 24న బోడపాడు గ్రామ సచివాలయం కార్యాలయంలో ఉదయం 10 గంటలకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తామని వెల్లడించారు.

చుండూరు మండలంలో నేటి నుంచి..

చుండూరు మండలంలో మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహించనున్నట్టు డెప్యూటీ తహసీల్దారు శ్రీనివాసరరావు తెలిపారు. 22న పెదగాదెవర్రు గ్రామ సచివాలయంలో, 24న పెనుగుదురుపాడు గ్రామ సచివాలయంలో, 26న తొట్టెంపూడి గ్రామ సచివాలయంలో, 29న చుండూరు గ్రామ సచివాలయంలో సభలు నిర్వహిస్తామని చెప్పారు.

డెల్టా ప్యాసింజర్ హాల్ట్ ప్లీజ్

వేమూరు: అన్ని రైల్వే స్టేషన్లలో డెల్టా ప్యాసింజర్ హాల్ట్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎన్నిసార్లు రాజకీయ నాయకులకు, అధికారులకు మొరపెట్టుకున్నా.. ఫలితం ఉండట్లేదని ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి గతంలో జంపని, వేమూరు, పెనుమర్రు తదితర స్టేషన్లలో డెల్టా ప్యాసింజర్‌కు హాల్ట్ ఉండేది. అయితే కరోనా సమయంలో ఈ రైలును కొంత కాలం రద్దు చేశారు. ఆ తర్వాత పునఃప్రారంభించినా.. ఈ స్టేషన్లలో హాల్ట్ ఇవ్వడం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రైలుకు రాత్రుళ్లు తెనాలి చినరావూరు, భట్టిప్రోలులో మాత్రమే హాల్ట్ ఇస్తున్నారు. అన్ని స్టేషన్లలో హాల్ట్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు అనేకమార్లు ప్రయాణికులు వినతిపత్రాలు అందించారు. అయినా ఫలితం శూన్యం. దీంతో ఉద్యోగులు, కూలీలు, వర్తకులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. అన్ని స్టేషన్లలో డెల్టా ప్యాసింజర్‌కు హాల్ట్ ఇవ్వాలని కోరుతున్నారు.



వేమూరు రైల్వే స్టేషను

జీవనోపాధి దెబ్బతింటుంది



డెల్టా ప్యాసింజర్ వేళలు విజయవాడ ఇతర పట్టణ ప్రాంతాల్లో కూలి పనికి వెళ్లే వాళ్లకు అనుకూలంగా ఉంటాయి. గతంలో రైలులో పనులకు వెళ్లేవారు. ఇప్పుడు హాల్ట్ లేకపోవడంతో ఇతర మార్గాల ద్వారా వెళ్లాల్సి వస్తోంది. దీనివల్ల ఖర్చులు ఎక్కువ అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైలుకు పెనుమర్రులో హాల్ట్ ఇవ్వాలి. – సిద్దెల రాజకిషోర్, పెనుమర్రు

అన్ని స్టేషన్లలో ఆపాలి



డెల్టా ప్యాసింజరును జంపని, వేమూరు, పెనుమర్రు తదితర అన్ని స్టేషన్లలో ఆపాలి. వేమూరులో హాల్ట్ లేక పోవడంతో సికింద్రాబాద్ వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతి నిధులు, రైల్వే అధికారులు స్పందించి డెల్టా ప్యాసింజరును అన్ని స్టేషన్లలో ఆపాలి. – అల్లూరు యోనాబాబు, జంపని

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

- జిల్లా సారథిగా మేరుగ ప్రమాణస్వీకారంతో రెట్టించిన ఉత్సాహం
- బాపట్లలో మరోమారు కనిపించిన ప్రభంజనం
- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన కార్యకర్తలు

బాపట్ల: వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షులుగా డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణస్వీకారం చేయడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. రెట్టించిన ఉత్సాహంతో కార్యకర్తలు కదంతొక్కారు. జిల్లా నలుమూలల నుంచి మేరుగ ప్రమాణ స్వీకారోత్సవానికి తరలివచ్చిన జన సందోహంతో సోమవారం బాపట్ల ప్రభంజనమైంది. తొలుత ఉదయం నుంచే పార్టీ బాపట్ల ఇన్‌చార్జి కోన రఘుపతి, రేపల్లె ఇన్‌చార్జి ఈవూరి గణేష్, వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్ బాబు, అద్దంకి ఇన్‌చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి, పర్చూరు ఇన్‌చార్జి యడం బాలాజీ నాయకత్వంలో ఎంపీపీలు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్లు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు బస్సులు, కార్లలో బాపట్లకు బయలుదేరారు. దారిపొడవునా జై జగన్ నినాదాలు మిన్నంటాయి. ఉదయం నుంచే పార్టీ కార్యకర్తలతో స్థానిక జమ్ములపాలెం రోడ్డు కిక్కిరిసిపోయింది. పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కో– ఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరావు, ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ప్రకాశం జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, ఎమ్మెల్సీలు లేళ్ళఅప్పిరెడ్డి, మాధవరావు, రాష్ట్ర కార్యదర్శి గాదె మధుసూదనరెడ్డి, రాష్ట్ర నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి చేసిన ప్రసంగాలతో మేరుగ ప్రమాణస్వీకారోత్సవ సభ హోరెత్తిపోయింది. అందరూ కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేద్దామని నాయకులు పిలుపునివ్వడంతో కార్యకర్తలు గళం కలిపారు. సైనికుల్లా పనిచేస్తామని ప్రతినబూనారు. ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటామని జిల్లా నాయకత్వం సంకేతాలు ఇవ్వడంతో శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం కనిపించింది.



వైఎస్సార్ సీపీ జిల్లా సారథిగా బాధ్యతలు చేపట్టిన డాక్టరు మేరుగ నాగార్జునకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ప్రకాశం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదర్‌డ్డి

మేరుగ ప్రసంగంతో ఉర్రూతలూగిన యువత

ప్రమాణ స్వీకారం అనంతరం డాక్టరు మేరుగ నాగార్జున చేసిన ప్రసంగంతో పార్టీ యువత ఉర్రూతలూగింది. ప్రతి కార్యకర్తకూ తానున్నానంటూ మేరుగ ప్రకటించడంతో యువత జేజేలు పలికింది. పార్టీ కోసం రాత్రీపగలూ పనిచేస్తామని ప్రతిజ్ఞ చేసింది. ప్రమాణస్వీకార కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు గోపాళం లక్ష్మీ దీపక్, కొల్లా వెంకట్రావు, ప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జంజనం శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కోకి రాఘవరెడ్డి, కాగిత సుధీర్‌బాబు, గవిని కృష్ణమూర్తి, దొంతిబోయిన సీతారామిరెడ్డి, మోదుగుల బసవపున్నారెడ్డి, దుంపా చెంచిరెడ్డి, శ్యామలారెడ్డి, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, చల్లా రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామ సభలు

రేపల్లె రూరల్: భూహక్కు భూసరంక్ష పథకం ద్వారా రీసర్వే పూర్తిచేసిన గ్రామాలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మళ్లీ పూర్తిస్థాయిలో గ్రామసభలు నిర్వహించి అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు ఆర్డీఓ ఎన్.రామలక్ష్మి చెప్పారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. గ్రామ సభల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు, అర్జీలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. దీనిలో భాగంగా డివిజన్ పరిధిలోని పలు గ్రామాలలో సభలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 22న పెద్దవరం, పులిచింతలపాలెం, పెదగేదలవర్రు, కారుమూరు, 23న పోతుమర్రు, యలవర్రు, బొద్దులూరుపాడు, పొన్నపల్లి, 24న నగరం,భలిజేపల్లి, గొరికపూడి, గోడపాడు, పెనుకుదురుపాడు, పరిశపాడు, 25న దోనేపూడి, 26న పమిడిమర్రు, తొట్టెంపూడి, అరవపల్లి, 29న పూడివాడ, కోనేటిపురం, చుండూరు, నవంబర్ 2న పల్లెకోన, 4న పల్లపట్ల గ్రామాలలో రెవెన్యూ గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆయా గ్రామాలలోని ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించి పరిష్కరించుకోవాలని కోరారు.

గుడిసెల తొలగింపునకు కుట్రలు తగవు

రేపల్లె రూరల్: బేతపూడి ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన 40 ఏళ్ల నుంచి గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్న నిరుపేదలను ఖాళీ చేయాలని అధికారులు ఇబ్బందులు పెట్టటం సరికాదని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలతో కలిసి సోమవారం తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావుకు స్థానిక కార్యాలయంలో వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. కాల్వకట్టపై ఉంటున్న వారు నిరుపేదలని, వారి వల్ల ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకం లేదని పేర్కొన్నారు. గతంలో వారికి నివేశన స్థలాలు ఇచ్చినా ఆ స్థలాలల్లో గృహాలు నిర్మించుకునే వసతులు లేవన్నారు. ఇప్పుడు కొంత మంది రాజకీయ అండదండలతో ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదులు చేసి గుడిసెలు తొలగింపునకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఆ సమీపాలలో పంట పొలాలకు వెళ్ళేందుకు పది అడుగుల బాట సదుపాయం ఉన్నా ఉద్దేశపూర్వకంగా చేస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోరాదన్నారు. నిరుపేదలు ఇళ్ళు నిర్మించుకునే వీలుగా గృహ నిర్మాణ పథకం మంజూరు చేయించటంతోపాటు నివేశన స్థలాలలో వసతి కల్పించాలన్నారు. అప్పటి వరకు గుడిసెలు తొలగించరాదని, పేదలపై ఒత్తిళ్లు ఆపాలని కోరారు. కార్యక్రమంలో బాధిత కుటుంబాలు జీ.ప్రకాష్, చంద్రలీల, నాగేశ్వరరావు, యశ్వత్‌కుమార్, సీపీఎం నాయకులు కేవీ లక్ష్మణరావు, ఆశీర్వాదం, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, బాధిత కుటుంబాలు

అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

డీఎస్పీ జనార్దనరావు

తెనాలిరూరల్: అమరవీరుల ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని డీఎస్పీ బి.జనార్ధనరావు సూచించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా స్థానిక చెంచుపేటలోని దివంగత ఐపీఎస్ అధికారి ఉమేష్‌చంద్ర విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో అశువులు బాసిన వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించి, వారిలో అభిమానాన్ని సంపాదించుకున్న అధికారులు, తోటి సిబ్బంది స్ఫూర్తితో విధులు నిర్వహించాలన్నారు. శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులకు ప్రజలందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ట్రైనీ డీఎస్పీ భార్గవి, సీఐలు ఎస్.రమేష్ బాబు, వి. మల్లికార్జునరావు ఆర్టీసీ డీఎం రాజశేఖర్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో..

తెనాలి రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ పోలీస్‌స్టేషన్ వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. జీఆర్పీ ఎస్ఐ జి.వెంకటాద్రి, స్టేషన్ మేనేజర్ టీవీ రమణ, ఆర్పీఎఫ్ సిబ్బంది, రైల్వే అధికారులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగంపై అవగాహన

రేపల్లె రూరల్: పట్టణంలోని అర్బన్ రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులకు పంట కోత ప్రయోగంపై మండల వ్యవసాయ అధికారి ఆర్.వి జయ్‌బాబు సోమవారం అవగాహన కల్పించారు. ప్రయోగానికి పైరును ఎంపిక చేయటం, సర్వే నంబర్లు, రాండమ్ నంబర్ల ఆధారంగా సర్వే నంబర్ల ఎంపిక, ఫారం 1, 2లు పూర్తి చేసే విధానం, ఆన్‌లైన్‌లో యాప్ ద్వారా పంట కోత నిర్వహణ రిపోర్టును నమోదు చేయటం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నెల 23న రైతులకు సాగుభూమిలో ఎలుకల నివారణకు రైతు సేవా కేంద్రాల వద్ద మందును పంపిణీ చేస్తామని, రైతులు కార్యక్రమానికి హాజరయ్యేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరావు, వీఏఏలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

కర్లపాలెం: రాష్ట్రస్థాయి హాకీ పురుషుల పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హైవెండ్ హైస్కూల్ డైరెక్టర్ పెదమల్లు చాందినీ, బి.సాయిమహేంద్ర తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయిలో జరిగిన అండర్–17 హాకీ పోటీలలో పిట్టు భానుచంద్రారెడ్డి, అండర్–14 హాకీ పోటీలలో లుక్కా గణేష్ మెరుగైన ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్–17 విభాగంలో నవంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు, అండర్–14 విభాగంలో నవంబర్ 8 నుంచి 11వ తేదీ వరకు అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీలలో తమ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. హాకీ క్రీడాకారులను పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

రేపు ఎలుకల నివారణ మందు పంపిణీ

అమర్తలూరు(వేమూరు) : అమర్తలూరు మండలంలో ఈనెల 23న ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయాధికారి లోకేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న అన్ని రైతు సేవా కేంద్రాల వద్ద ఎలుకల నివారణకు బ్రోమోడయలిన్ 0.25 శాతం మందుకు నూకలు, నూనెతో కలిపి రైతులకు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరటం తథ్యం

వైఎస్సార్ సీపీ నేత డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి: రానున్న రోజుల్లో ప్రతి గ్రామంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరటం తథ్యమని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ చెప్పారు. సోమవారం బాపట్లలో జరుగుతున్న వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా కొత్త అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు డాక్టర్ ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో ఒక బస్సు, 20 కార్లలో ర్యాలీగా తరలి వెళ్ళారు, ర్యాలీని డాక్టర్ గణేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, ఆరుంబాక సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, ఏమినేని సుబ్బారావు, కొత్తపల్లి సుబ్బయ్య, జాలాది ఇస్సాకు(బుజ్జి), బగ్గారెడ్డి, కాసీ ప్రభాకర్, కాటూరి బసవయ్య, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.



గణేష్ ఆధ్వర్యంలో చెరుకుపల్లి నుంచి డాక్టర్ మేరుగ నాగార్జున ప్రమాణ స్వీకారానికి తరలి వెళ్తున్న దృశ్యం

పాడి పరిశ్రమ అభివృద్ధికే మినీ గోకులాలు

పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నాంచారయ్య

రేపల్లె రూరల్: పశుపోషకులను ప్రోత్సహించి పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మినీ గోకులం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య అన్నారు. మినీగోకులం పథకానికి ఎంపికైన పశుపోషకులకు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణంలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పథకంలో భాగంగా ఆవులుగానీ, గేదెలుగానీ కలిగిన పశుపోషకులు ప్రభుత్వ సహకారంతో షెడ్‌లు నిర్మించుకునేందుకు అవకాశం ఏర్పడిందన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, నిర్దేశిత కొలతల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలన్నారు. లబ్ధిదారులు డిసెంబర్ మొదటి వారంలోపు నియోజకవర్గంలో మంజూరైన మినీ గోకులం షెడ్లును పూర్తి చేసుకోవాలని, తద్వారా మరికొంత మంది అర్హత కలిగిన వారిని ఎంపిక చేసి వారికి లబ్ధి చేకూర్చటం జరుగుతుందని పేర్కొన్నారు. రేపల్లె, నగరం, నిజాంపట్నం మండలాలకు 152 యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఒక్కొక్క రైతుకు 2 పశువులు, 4 పశువులు, 6 పశువులకు షెడ్లులు నిర్మించుకునేందుకు అవకాశం ఉందన్నారు. 2 పశువుల షెడ్డుకు రూ.1.15 లక్షలు, 4 పశువుల షెడ్డుకు రూ.1.85 లక్షలు, 6 పశువుల షెడ్డుకు రూ.2.20 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. దీనిలో లబ్ధిదారుని వాటా 10 శాతం చెల్లించాల్సి ఉండగా మిగిలిన 90 శాతం వాటాను ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. పాత షెడ్లులను చూపించి బిల్లులు మంజూరు చేయటం కుదరదన్నారు. షెడ్లుల నిర్మాణం ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు జియోటాగింగ్ చేయాలని తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్, రేపల్లె, పశువైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, హేమప్రియ, కరిముల్లా, రోషన్‌బేగ్, జ్యోత్స్న, పశువైద్య సిబ్బంది, ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ రేపల్లె, నగరం, నిజాంపట్నం మండలాల ఏపీవోలు, ఫీల్డు అసిస్టెంట్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు నాంచారయ్య



సమావేశంలో పాల్గొన్న లబ్ధిదారులు

బాణసంచా దుకాణాలకు సింగిల్‌విండో అనుమతులు

- ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలి
- తప్పనిసరిగా జీఎస్టీ చెల్లించాల్సిందే
- డివిజన్ స్థాయి సమావేశంలో అధికారులు

తెనాలి: దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలకు సంబంధించిన డివిజన్ స్థాయి సమావేశాన్ని సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ఆదేశాల మేరకు తెనాలి తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ సమావేశానికి అధ్యక్షత వహించారు. డివిజను నుంచి మున్సిపల్, రెవెన్యూ, అగ్నిమాపకశాఖ, పోలీస్ అధికారులు హాజరయ్యారు. బాణసంచా విక్రయ దుకాణాల కోసం హోల్‌సేల్/రిటైల్ వ్యాపారులు, జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈనెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో మూడు శాఖల సిబ్బంది, దరఖాస్తులను పరిశీలించి, అనుమతులను ఇస్తారని తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులు వీధుల్లో విక్రయించే నిమిత్తం తోపుడు బండ్ల వ్యాపారులకు బాణసంచాను కేటాయించవద్దని, అనవసర ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వొద్దని కోరారు. విక్రయ దుకాణాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలను నియమించరాదని చెప్పారు. బాణసంచా వ్యాపారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న చెప్పారు. సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ, బాణసంచా దుకాణాలు ఎల్ ఆకారంలో ఏర్పాటుచేయాలనీ, ఒక్కో దుకాణానికి మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని చెప్పారు. ప్రతి దుకాణంలోనూ ఇసుక బకెట్లు, నీటి వసతిని అందుబాటులో ఉంచుకోవటం తప్పనిసరిగా వివరించారు. విక్రయదారులు కచ్చితంగా జీఎస్టీ చెల్లించాలని, అప్పుడే వారికి లైసెన్సులు ఇవ్వాలని జీఎస్టీ అధికారి సుధాకర్ చెప్పారు. తెనాలిలో బాణ సంచా దుకాణాల ఏర్పాటుకోసం టీజే కాలేజి, వీఎస్సార్ కాలేజి గ్రౌండ్స్‌లో వర్షంనీరు నిలిచినందున ప్రత్యామ్నాయ స్థలాన్ని చూస్తామని అధికారులు వెల్లడించారు. బాణసంచా వ్యాపారులతో మంగళవారం సమావేశం జరిపి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. తెనాలి ట్రైనీ డీఎస్పీ ఎస్.భార్గవి మరివాడ, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబు, మంగళగిరి, తెనాలి సీఐలు డి.వినోద్‌కుమార్, వి.మల్లికార్జునరావు, కె.వేదాంతరావు, దుగ్గిరాల తహసీల్దార్ సునీత, సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ జి.సుధాకిరణ్మయి పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన డివిజన్‌స్థాయి సమావేశంలో వివిధ శాఖల అధికారులు

ఆదర్శ రైతు రామకృష్ణకు రైతునేస్తం అవార్డు

తెనాలి: తన సమీకృత ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో బియ్యం, రకరకాల కూరగాయలు, పండ్లు సాగుచేస్తూ అక్కడి చెరువులో చేపలను కూడా పెంచుతున్న ఆదర్శ రైతు మీసాల రామకృష్ణకు రైతునేస్తం అవార్డు లభించింది. గన్నవరం మండలం ఆత్కూరులో స్వర్ణభారతి ట్రస్ట్‌లో ఆదివారం రైతునేస్తం అవార్డుల ప్రదానం కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు చేతులమీదుగా అందుకున్నారు. రామకృష్ణ స్వస్థలం తెనాలి రూరల్ మండల గ్రామం నందివెలుగు. గ్రామం వెలుపల నిజాంపట్నం కాలువ పక్కనే ఉన్న 13 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో కొన్నేళ్లుగా సమీకృత ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. అరెకరంలో చేపల చెరువు. ఆరు ఎకరాల మాగాణిలో బీపీటీ–5204 సహా, వివిధ దేశావాళీ వరి రకాలను సాగుచేస్తున్నారు. మెట్ట భూమిలో అరటి, చెక్కెరకేళి, కూరఅరటి, ఐదెకరాల్లో బీర, బెండ, పొట్లకాయ, కాకరకాయ, కీరదోస, దోస, సొరకాయ, గోరుచిక్కుడు, తోటకూర, గోంగూర, మునగ, కరివేపాకు, పాలకూర, మిగిలిన విస్తీర్ణంలో కొబ్బరి, మామిడి, జామ, నిమ్మ, నారింజ చెట్లు ఉన్నాయి. ఒక కుటుంబానికి రోజువారీ కావాల్సిన బియ్యం, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు అన్నీ అక్కడే దొరుకుతున్నాయి. పొలం గట్టునే ఆహారోత్పత్తుల మార్కెట్‌గా చేసుకుని, తోట దగ్గరే వాటని విక్రయిస్తూ, ప్రతిరోజూ ఆదాయాన్ని పొందుతున్నారు రామకృష్ణ. వీరి వ్యవసాయ క్షేత్రాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు సందర్శించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరి, సంఘం ఆధ్వర్యంలో సమీపంలోనే ఆర్గానిక్ సరుకులతో సూపర్‌మార్కెట్‌నూ నడుపుతున్నారు. ఆ క్రమంలోనే రైతునేస్తం అవార్డు వరించింది.



మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడుచే అవార్డు స్వీకరించిన రామకృష్ణ

రేపు ప్రొఫెసర్ సాయిబాబు సంస్మరణ

తెనాలి: తుదిశ్వాస వరకు పీడిత ప్రజలు, ఆదివాసుల హక్కుల కోసం ఉద్యమించిన ప్రొఫెసర్ సాయిబాబు సంస్మరణ సభను 23న తెనాలిలో నిర్వహించనున్నారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక, భారత్ బచావో, భిన్నస్వరాలు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం ఈ సభ జరగనుంది.